సాక్షి చిత్తూరు

శనివారం : 9 : ఆగస్టు : 2025



ఆలయాల్లో దొంగలు పడ్డారు

పలమనేరు నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో వరుస చోరీలు చోటు చేసుకోవడం కలకలం రేపుతోంది. - 8లో



ఎరుపెక్కిన నగరి

నగరి పట్టణంలో ఈనెల 9, 10 తేదీల్లో సీపీఐ జిల్లా స్థాయి మహాసభలు నిర్వహించనున్నారు. - 8లో



ఆగని ఏనుగుల దాడులు

పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. రెండు రోజులుగా పంటలపై పడి నాశనం చేస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

15న జనరల్ నాలెడ్జ్ టెస్ట్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో జనరల్ నాలెడ్జ్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు రాజారత్నంరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు టెస్ట్ ప్రారంభమవుతుందన్నారు. 8, 9, 10 తరగతులు పూర్తి చేసిన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని, 9908274927 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

బోయకొండ పాలకమండలికి దరఖాస్తులు

చౌడేపల్లె: బోయకొండ పాలక మండలి ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ ఏకాంబరం శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేవదాయ ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వి.వినయ్‌చంద్ ఈ నెల 7వ తేదీన విడుదల చేసిన ఆదేశాల మేరకు 27 వ తేదీలోపు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను బోయకొండ గంగమ్మ దేవస్థానం పరిపాలనా భవనంలో అందజేయాలని కోరారు.

12న మెగా టింకరింగ్ డే

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 12వ తేదీన మెగా టింకరింగ్ డే నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. పాఠశాలల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు తప్పనిసరిగా మెగా టింకరింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. డీవైఈవో, ఎంఈవోలు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు.

28న జాతీయ క్రీడా వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈనెల 28వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుల ఎంపిక నిర్వహించాలన్నారు. దీనికి సంబంధించి దరఖాస్తులను స్వీకరించేందుకు ఈనెల 18 ఆఖరి తేదీ అని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఐదు ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పశుగ్రాస విత్తనాల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఆరిఫ్ తెలిపారు. జిల్లాకు 375 మెట్రిక్ టన్నుల జొన్న, మొక్కజొన్న విత్తనాలు వచ్చాయన్నారు. ఇప్పటికే మండలాల వారీగా సరఫరా ప్రారంభమైందన్నారు. జొన్న కేజీ రూ.23, మొక్కజొన్న కేజీ రూ.17 చొప్పున అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

23 నుంచి ఈఎండీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 23వ తేదీ నుంచి ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ (ఈఎండీ) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. పర్యవేక్షణకు జిల్లా స్థాయి మేనేజర్‌ను నియమించనున్నారు. జిల్లాకు ఇద్దరు మెంటర్ టీచర్లను ఎంపిక చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. రిజిస్ట్రేషన్‌లకు లీప్ యాప్‌లో అవకాశం కల్పించారు.

ఇస్రో క్విజ్ పోటీల్లో ప్రతిభ



ఇస్రో క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన పీవీకేఎన్ కళాశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇస్రో క్విజ్ పోటీల్లో పీవీకేఎన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ కళాశాలలో విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఇస్రో క్విజ్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ కళాశాల నుంచి విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రెజెంటేషన్ విభాగంలో తృతీయ బహుమతి పొందినట్లు వెల్లడించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు భానుప్రసాద్, రమేష్, భ్రమరాంబిక, రామమూర్తి, రామసాగర్, ఉదయభాస్కర్లను ప్రత్యేకంగా అభినందించారు.శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని మెలకువలను నేర్చుకుని విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు శరవణ పాల్గొన్నారు.

ఆడి శుక్రవారం



వేంబళగి అమ్మన్ ఆలయానికి ఊరేగింపు

నగరిలో ఆడి శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఓంశక్తి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పాల కళాశాలతో ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు. రిటైర్డ్ ఏఎస్పీ పాలేగారు కోసలరాం ముఖ్యఅతిథిగా హాజరై ఊరేగింపును ప్రారంభించారు, భక్తులు తెచ్చిన గంజి, అంబలిని ఆలయ నిర్వాహకులు భక్తులకు పంచిపెట్టారు. అలాగే నెత్తంకండ్రిగ కొండపై ఉన్న వేంబళిగి అమ్మవారికి మహిళా భక్తులు పాలకుండలతో ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకుడు బాబు భక్తులకు అన్నప్రసాదాలు, వస్త్రదానం చేశారు. - నగరి

వరలక్ష్మీ కటాక్షం!



వరలక్ష్మీవ్రత పూజ నిర్వహిస్తున్న అర్చకులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధ దేవాలయమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవరదరాజ స్వామి వారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజలు చేశారు. అన్నకుటోత్సవం నిర్వహించి భక్తులకు వితరణ చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస ఆచార్యులు, ఈవో పెంచలకిషోర్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో.. సెల్‌గాటం!



ఫోన్ సమస్యలపై ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకుడు. (ఫైల్)



కూటమి నేతలు అంగన్‌వాడీ కార్యకర్తలతో 'సెల్'గాటమాడుతున్నారు. సవాలక్ష యాప్‌లు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారు. మొరాయిస్తున్న పాతఫోన్లతో పనిచేయలేక కార్యకర్తలు నలిగిపోతున్నారు. సకాలంలో రిపోర్టులు అప్‌లోడ్ చేయలేక అధికారుల వద్ద చీవాట్లు తింటున్నారు. నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని, యాప్ కష్టాల నుంచి దూరం చేయాలని.. వేతనాలు పెంచాలని అధికారులు, నేతలకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఏం చేయాలో దిక్కుతోచక.. పాత ఫోన్లు వినియోగించలేక తలలు పట్టుకుంటున్నారు.

ఆపసోపాలు పెడుతున్న యాప్‌లు

- పనిచేయని ఫోన్లతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- జిల్లా మొత్తం అంగన్‌వాడీల్లో ఇదే తంతు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



పనిచేయని ఫోన్లు తమకొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న నగరి నియోజకవర్గ అంగన్‌వాడీ కార్యకర్తలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెయిన్ 1,795, మినీ 625 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 10,422, బాలింతలు 9,438 మంది ఉన్నారు. అదేవిధంగా 7–3 సంవత్సరాలలోపు పిల్లలు 56,131 మంది, 3–6 సంవత్సరాల లోపు వారు 37,454 మంది ఉన్నారు. ఉన్న సెల్‌ఫోన్లు మొరాయిస్తుండడంతో కార్యకర్తలు సేవలందించేందుకు నానాతంటాలు పడుతున్నారు.

యాప్‌ల గోల ఇలా..

జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సవాలక్ష సమస్యలు రాజ్యమేలుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పోషకాహారం అందించాల్సి ఉంటుంది. అదేవిధంగా రోజూ హాజరు నమోదు యాప్‌ల ద్వారానే అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలి. మరోవైపు పోషన్ ట్రాకర్, బాలసంజీవిని, కిశోర వికాసం, మిషన్ వాత్సల్య, సఖి ఇలా అనేక యాప్‌లలో వివరాలు ప్రతి రోజూ నమోదు చేయాల్సి ఉంటుంది. ఇటీవల కొత్తగా ప్రధానమంత్రి మాతృవందన యోజన బాధ్యతలను సైతం అప్పగించారు. ఈకేవైసీతో పాటు ఫేస్, ఐరీస్, వేలిముద్రలు తదితర విధానాల్లో హాజరు తీసుకోవాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయికి వెళ్లి లబ్ధిదారుల వివరాలను సెల్‌ఫోన్‌లలో నమోదు చేయాలి. అయితే ప్రస్తుతం ఉన్న ఫోన్‌లు పనిచేయకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

నెట్‌వర్క్ అందక

జిల్లాలోని కుప్పం, పలమనేరు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు మారుమూల ప్రాంతాల్లో ఉన్నాయి. అలాంటి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల సెల్‌ఫోన్లకు నెట్‌వర్క్ అందడం లేదు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ ప్రకారం 5జీ ఫోన్ల వినియోగం పెరిగింది. ఆ నెట్‌వర్క్‌కు అనుగుణంగా ఆయా టెలికం సంస్థలు సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం కార్యకర్తల వద్ద ఉన్న ఫోన్లలో చాలా వరకు సిగ్నల్స్ అందడంలేదు. యాప్ సేవలు ఉపయోగించలేకపోతున్నారు. మారుమూల సిగ్నల్స్ అందని ప్రాంతాల్లో కార్యకర్తలు ప్రస్తుతం ఉన్న ఫోన్లను పక్కన పెట్టేశారు.

జిల్లా సమాచారం

మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు -	1,795
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు -	625
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు -	2,420
జిల్లాలోని మహిళలు -	9,31,752
గర్భిణులు -	10,422
బాలింతలు -	9,438
7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు -	56,131
మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు -	37,454

ఈ సమస్యపై అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు పలు మార్లు ధర్నాలు నిర్వహించారు. అయినా కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు.

కొత్త ఫోన్లు పంపిణీ చేయాలి



ప్రస్తుతం ఉన్న ఫోన్లు పనిచేయడం లేదు. కార్యకర్తలు రోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలు మార్లు ధర్నాలు సైతం నిర్వహించారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. పనిచేయని ఫోన్లతో కార్యకర్తలు విధులు ఎలా నిర్వహించాలి..?. ఆ ఫోన్లతో సకాలంలో ఉన్నతాధికారులకు రిపోర్టులు ఇవ్వకపోతే నోటీసులు ఇస్తామంటూ బెదిరిస్తున్నారు. మొదట అధునాతన టెక్నాలజీ ఉన్న ఫోన్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి.

ట్రాన్స్‌కోకు రూ.3 లక్షల నష్టం

చిత్తూరు కార్పొరేషన్: గాలీవాన కారణంగా ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈమేరకు నగర సబ్‌డివిజన్ పరిధిలోని మిట్టూరు సెక్షన్‌లో కరెంటు స్తంభం, సంతపేటలో 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు 2 నేలవాలాయన్నారు. గుడిపాల సబ్‌డివిజన్‌లో చిత్తూరు రూరల్ సెక్షన్‌లో 4 కరెంటు స్తంభాలు, 220 కేవీ సబ్‌స్టేషన్‌లో టవర్ లైన్ కట్ అయ్యిందన్నారు. రెడ్డిగుంట సెక్షన్‌లో 4 పోల్స్, ఒక 25 సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నట్టు తెలిపారు. బంగారుపాళ్యంలో 2 కరెంటు స్తంభాలు, అరగొండ 3 కరెంటు స్తంభాలు, 125 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్, ఐరాలలో 11 కేవీ ఇన్సులేటర్లు 5 నేలవాలినట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్టు వెల్లడించారు.



అరగొండలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్



చిత్తూరు నగరంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం, బంగారుపాళ్యంలో పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది

ఇదేంది వినాయకా?

కాణిపాక వినాయక దేవస్థానంలో టెండర్‌దారులు డిపాజిట్ల చెల్లింపులో జాప్యం చేస్తున్నారు. ఈ జాప్యంతో డిపాజిట్ చెల్లింపు సొమ్ము రూ.కోటి దాటింది. పలు టెండర్‌దారులు చెల్లింపునకు అధికారాన్ని అడ్డుపెడుతున్నారు. అదనపు వసూళ్లను మాత్రం యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకుని ఈ వ్యవహారాన్ని నడిపిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

కాణిపాక దేవస్థానంలో పేరుకుపోయిన డిపాజిట్ బకాయిలు

- అధికారాన్ని అడ్డం పెట్టుకుని చెల్లించని టెండర్‌దారులు
- అడ్డగోలుగా అదనపు వసూళ్లు
- పట్టించుకోని అధికారులు



కాణిపాక దేవస్థానం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి క్షేత్రానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లో భక్తుల సంఖ్య 10 వేలు దాటుతోంది. శని, ఆదివారాల్లో 30 వేల మంది దాకా వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఇక్కడ పలు షాపులు, నిర్వహణలు జరుగుతుంటాయి. ఇందులో కొబ్బరికాయలు కొట్టే ప్రాంతం, మొబైల్ కౌంటర్, చెప్పుల కౌంటర్, పూజాసామగ్రి అమ్మకాలు, పాలు, వాహన పూజ, పార్కింగ్, టోల్‌గేట్, షాపులు తదితరాలు జరుగుతుంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీటిలో చాలా వరకు చేతులు మారాయి. కూటమినేతలు అధికారిన్ని అడ్డంపెట్టుకుని అడ్డుగోలుగా దక్కించుకున్నారు. ఇందులో కొన్ని టెండర్లు, వేలం పాటకు రాకుండా అలాగే కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

టెండర్ల సొమ్ము చెల్లించరా?

గత ఆరు నెలల కిందట పలు షాపుల నిర్వహణకు సంబంధించి ఆలయ అధికారులు నామమాత్రంగా టెండర్లు పిలిచారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొందరు టెండర్లను దక్కించుకున్నారు. వీరు టెండర్లు జరిగి నెలలు గడుస్తున్నా ఇంతవరకు టెండర్ సొమ్ము జమ చేయలేదన్న ఆరోపణలున్నాయి. అప్పట్లోనే రూ.కోటికిపైగా ఉన్న టెండర్ బకాయిలు.. ఆ తర్వాత రూ.90 లక్షలకు నిలిచింది. కొత్తగా జరిగిన టెండర్లతో ఆలయానికి చెల్లించాల్సిన టెండర్ నగదు మళ్లీ రూ.కోటి దాటినట్టు తెలుస్తోంది. ఈ చెల్లింపుపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. టెండర్లు దక్కించుకున్న వెంటనే నగదు చెల్లింపులు చేసుకోవాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమిలోని మరో వర్గం కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందని వారు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ ప్రజాప్రతినిధి బినామీ పేర్లతో వీటిని నిర్వహిస్తున్నారని, అందుకే డిపాజిట్ చెల్లింపుపై అధికారులు సైతం నోరు విప్పడం లేదని వారు చెబుతున్నారు.

యథేచ్ఛగా అదనపు వసూళ్లు

ఆలయ అధికారుల ఆదేశాలు, నిర్ణయాల మేరకు అమ్మకాలు జరగాలి. వారు నిర్ణయించిన ధర ప్రకారమే నిర్వహణ దారులు వసూలు చేయాలి. అయితే పలువురు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. అదనపు వసూళ్లకు తెరలేపుతున్నారు. రూ.5 నుంచి రూ.20 వరకు అదనంగా భక్తుల నుంచి గుంజేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆలయం ఎదుటే ఇవన్నీ జరుగుతున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టెండర్ల చెల్లింపు, అదనపు వసూళ్ల కట్టడికి చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే బ్రహ్మోత్సవ సమయంలో ఈ దోపిడీ మరింత అధికమయ్యే అవకాశాలున్నాయని వారు వివరిస్తున్నారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ప్రత్యేక పూజలు



మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పలమనేరు: ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ పట్టణంలోని మారెమ్మ ఆలయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం 101 కొబ్బరికాయలను కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా తన చిరకాల శత్రువైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కక్షసాధింపులకు పాల్పడుతోందన్నారు. ఇందులో భాగంగానే ఆయన తనయుడు మిథున్ రెడ్డిపై తప్పుడు కేసు బనాయించి జైలుకు పంపారన్నారు. ఎన్ని కుట్రలు జరిగినా న్యాయస్థానంలో తప్పకుండా ఆయనకు న్యాయం జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈనెల 12న ఆయనకు బెయిల్ రావాలని పూజలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. నాయకులు మండీసుధా, ప్రహ్లాద, సోమచంద్రారెడ్డి, రఘునాథ్, కోదండరామయ్య, శ్యామ్‌సుందర్, నాగరాజ్, ప్రసాద్, పవన్, చేపల బాబు, నరేష్, రవి, ఈశ్వర్‌రెడ్డి, జగదీష్, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



బోయకొండలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో సంప్రదాయరీతిలో అర్చనలు , అభిషేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసపు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, గాజులతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

క్లుప్తంగా

తోతాపురి కిలోకు రూ.8 చెల్లించాల్సిందే


సంతకాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

తవణంపల్లె: గుజ్జు ఫ్యాక్టరీలు రైతుల నుంచి కొనుగోలు చేసిన తోతాపురికి ప్రభుత్వం కిలోకు రూ.8 చొప్పున చెల్లించాలని, అలాగే సబ్సిడీ రూ.4 రైతు ఖాతాలో జమచేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు ఆనందనాయుడు, జనార్దన్, హరిబాబుచౌదరి, మనోహర్‌నాయుడు, సుకుమార్‌నాయుడు, సుధీర్‌నాయుడు, హరిబాబు, రఘుపతినాయుడు, మునీశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ తోతాపురికి గుజ్జు ఫ్యాక్టరీ యాజమానులు కిలోకు రూ.8 ఇచ్చే వరకు పోరాడుతామన్నారు. ఫ్యాక్టరీ యజమాను సిండికేట్ కావడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యజమానులు మామిడి కాయలను ఫ్యాక్టరీల్లో అన్‌లోడ్ చేసుకొని ధరలపై ఇప్పటి వరకు నోరుమెదపకపోవడం దారుణమన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. తర్వాత రైతుల నుంచి సంతకాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


శామ్యుల్ హరీష్

నగరి : మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయపురం గొల్లకండ్రిగకు చెందిన శామ్యుల్ (21), ఆర్.హరీష్ (18)కు తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై వేలావడి వైపుగా నగరికి వెళ్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. హరీష్ కాలి ఎముక విరగగా, శామ్యుల్ తలకు గాయమైంది. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 65,234 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,133 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమరి్పంచారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

మేమింతే..మారం అంతే!

- వివాదాలకు కేంద్రంగా చిత్తూరు వన్‌టౌన్
- గతంలో దొంగ నుంచి డబ్బులు తీసున్నారనే ఆరోపణలు
- తాజాగా హోమ్‌గార్డు సొంత పనులకు?
- అధికారిని వదిలేసి.. హెడ్ కానిస్టేబుల్ వీఆర్



చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్.. ఇటీవల నిత్యం వార్తల్లో నిలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారితో పాటు కొందరు సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. అధికారికి స్థానచలనం కల్పించి.. ఇంకొందరిని మాత్రం అలాగే వదలేశారు. మళ్లీ ఇప్పుడు ఓ హోంగార్డును సొంత పనులకు వాడుకున్నారనే ఆరోపణలు రావడంతో హెడ్ కానిస్టేబుల్‌ను వీఆర్ (వేకంట్ రిజర్వు)కు తీసుకున్నారు. కానీ హోంగార్డును వాడుకున్న అధికారిని మాత్రం ఉపేక్షించి వదిలేశారు.

మారరా..?

చిత్తూరు నగరంలోని కట్టమంచిలో గత ఏడాది ఓ దొంగతనం జరిగింది. దాదాపు రూ.9 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ కేసులో నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులు.. అతడి నుంచి రూ.లక్షల్లో లంచాలు తీసుకున్నారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించి, నివేదిక తెప్పించుకున్నారు. కానీ విచారణలో ఏం తేలిందనే విషయం మాత్రం రహస్యంగానే ఉంచేశారు. ఇద్దరు అధికారులు, ముగ్గురు సిబ్బందిపై ఆరోపణలు రాగా.. కేవలం ఓ అధికారిని మాత్రం వీఆర్‌కు పంపించారు. ఈ ఉదాసీనత తప్పుచేసిన మిగిలినవాళ్లకు ధైర్యాన్ని ఇచ్చినట్లయ్యింది. ఇటీవల వరుస ఆరోపణలకు మళ్లీ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కేంద్రబిందువుగా మారింది.

వాస్తు మార్పులు

స్టేషన్‌లో పనిచేసే ఒకరిద్దరు అవినీతి ఆరోపణల్లో చిక్కుకోవడం, సిబ్బందిని వాడుకున్నారనే ఆరోపణలు రావడంతో ఇక్కడ పనిచేసే మిగిలిన వాళ్లు నలిగిపోతున్నారు. ఇతర సిబ్బందిపై తప్పుడు మాటలు చెప్పడం, స్టేషన్‌లో జరిగే విషయాలను నేతలకు ఉప్పందించడం లాంటి విమర్శలు ఎదుర్కొనేవాళ్లు బాగానే ఉన్నారని.. ఏమీ తెలియని తమపై ఒత్తిడి పెరుగుతోందని పలువురు వాపోతున్నారు. అసలు కొద్ది రోజులుగా స్టేషన్ పరిస్థితి బాగోలేదని గుర్తించారు. ఈశాన్యంలో బరువు ఉండడమే దీనికి కారణమని భావించి, పలు తనిఖీల్లో పట్టుబడ్డ వాహనాలను ఈశాన్యం నుంచి తీయించి, మరోవైపునకు మార్చారు. మారాల్సింది తప్పుచేసే వాళ్ల బుద్ధి తప్ప.. బరువు కాదని ఇప్పటికైనా గుర్తిస్తే ఫలితం ఉంటుంది.

ఇదేం న్యాయం

మూడు రోజుల క్రితం ఇక్కడ పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ హోంగార్డును సొంత పనులకు పంపించారనే ఆరోపణలపై హెడ్‌కానిస్టేబుల్‌ను వీఆర్‌కు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే స్టేషన్‌లో తనపైఅధికారి అడిగితే హోంగార్డును పంపడం, ఆయన హోంగార్డును కడప వరకు డ్రైవర్‌గా వాడుకున్నట్లు సమాచారం. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో హెడ్‌కానిస్టేబుల్‌పై బదిలీ వేటు పడింది. కానీ హోంగార్డును వాడుకున్న అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆగని ఏనుగుల దాడులు


కుమ్మరిపల్లె వద్ద ఏనుగులు విరిచేసిన ముళ్ల కూసాలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. రెండు రోజులుగా ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడులు చేస్తున్నాయి. పాళెం పంచాయతీలోని అటవీ సమీప ప్రాంతం చింతల వంకలో తిష్టవేసి పగలంతా అక్కడే ఉండి రాత్రి పూట సమీప గ్రామాల్లోని పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని కుమ్మరపల్లె, జూపల్లె, పాళెం, కోటపల్లె పరిసర ప్రాంతాల్లోని మామిడి, అరటి, టమాట, మామిడి తోపుల చుట్టూ వేసిన ఇనుప కంచి, కూసాలను విరిచేశాయి. పొలాల వద్దకు వెళ్లొద్దని అటవీశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

మూలస్థాన ఎల్లమ్మ పాలక మండలికి దరఖాస్తులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ నుంచి 20 రోజుల లోపు దేవాదాయ ధర్మదాయశాఖ జిల్లా కార్యాలయంలో నేరుగా కానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్ కాపీ, రెండు పాసు పోర్టు సైజ్ ఫొటోలు, అఫిడవిట్ జతపరచాలని పేర్కొన్నారు.

ఆలయాల్లో దొంగలుపడ్డారు!

- మొన్న బైరెడ్డిపల్లి గంగమ్మ ఆలయంలో చోరీ
- తాజాగా గొల్లపల్లి గంగమ్మ ఆలయంలో..
- ఇప్పటికే ఏడు ఆలయాల్లో దోపిడీ


పలమనేరు మండలంలోని గొల్లపల్లి గంగమ్మ ఆలయం

పలమనేరు: నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో దొంగలు పడ్డారు. ఇటీవల మండల కేంద్రమైన బైరెడ్డిపల్లి గంగమ్మ ఆలయంలో రూ.2 లక్షల విలువైన అమ్మవారి మంగళ సూత్రాన్ని చోరీచేశారు. తాజాగా గురువారం రాత్రి పలమనేరు మండలంలోని గొల్లపల్లి గంగమ్మ ఆలయంలో రూ.3 లక్షల దాకా దోచుకెళ్లారు. అర్ధరాత్రిలో కొందరు యువకులు ఆటోలో వచ్చి ఆలయంలో చోరీచేసి వెళ్తుండగా స్థానికులు గమనించి వారిని పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. కాగా టీనేజర్ దొంగలైన వీరు పెద్దపంజాణి మండలానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. జల్సాల కోసం వీరు ఇలా ఆలయాల్లో చోరీలను ఎంచుకున్నట్టు సమాచారం. వీరి ద్వారా మిగిలిన దొంగల ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

దోచుకెళ్లినా పట్టుకోరా?

ఇటీవల బైరెడ్డిపల్లి పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న బాటగంగమ్మ ఆలయంలో దొంగలు పడ్డారు. ఆలయ ప్రధాన ద్వారాన్ని తీసి లోపల అమ్మవారి మెడలోని బంగారు మంగళ సూత్రాన్ని చోరీచేశారు. ఈ కేసును అక్కడి పోలీసులు ఇప్పటిదాకా ఛేదించలేదు. ఆరు నెలల క్రితం పలమనేరు మండలంలోని ముసలిమొడుగు ప్రాంతం గుడియాత్తం రోడ్డులోని రహదారి పక్కనున్న పలు ఆలయాల్లో హుండీలను ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లారు. ఈ చోరీలకు పాల్పడిన దొంగలను ఇంతవరకు పోలీసులు పట్టుకోలేదు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పుత్తూరులో వర్ష బీభత్సం


వేప చెట్టు పడడంతో ధ్వంసమైన కారు

పుత్తూరు: మండల పరిధిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. పుత్తూరులో 74.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన రామారావు కాలనీలో గాలీ వానకు 80 ఏళ్ల నాటి వేపమాను నేలకొరిగింది. కాలనీకి చెందిన మూడు కుటుంబాల వారు తమ కార్లను ప్రతిరోజూ చెట్టు సమీపంలోనే పార్కు చేసేవారు. గాలీవానకు మహావృక్షం కూలడంతో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. చెట్టు రోడ్డుకడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ వైర్లు సైతం తెగి రోడ్డుపై పడ్డాయి. ఎలాంటి ప్రాణనష్టమూ సంభవించలేదు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రపాణి, దిలీప్‌మొదలి రాకపోకలు పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టారు. పుత్తూరులో ఆగస్టులో సాధారణ వర్షపాతం 146.1 మి.మీ కాగా గురువారం రాత్రి ఒక్కరోజే 74.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎంబీ రోడ్డులోని అండర్ బ్రిడ్జిలో నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అలుపెరుగని అక్షర సేనాని శ్రీనివాస్



కేఎస్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

పలమనేరు: అలుపెరుగని అక్షర సేనాని డా.శ్రీనివాస్ అని పలమనేరు రచయితల సంఘనేత పలమనేరు బాలాజీ పేర్కొన్నారు. ఆ మేరకు పట్టణంలోని లయన్స్ సేవా కేంద్రంలో శుక్రవారం కేఎస్.జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. పత్రికా సంపాదకులుగా, సాహిత్య సామాజిక విశ్లేషకుడిగా ఆయన సాహిత్య ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. పురస్కార గ్రహీత డా.శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు జయమ్మ పురస్కారం రావడం ఆనందంగా ఉందన్నారు. రచయితలు ఉమామహేశ్వరావు, వెంకటకృష్ణ, సుంకోజి దేవేంద్రాచారి, రాఘవశర్మ, బాలసుబ్రమణ్యం, నెమిలేటికిట్టన్న, బాబ్జీ, కొత్తపల్లి సురేష్, కృష్ణమూర్తి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, పల్లిపట్టు నాగరాజుతోపాటు స్థానిక రచయితలు గండికోట వారిజ, సంధ్యారాణి, పవిత్రతోపాటు పలు ప్రజాసంఘాలు పాల్గొన్నాయి.

23న జాతీయ అంతరిక్ష దినోత్సవం

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌తో పాటు దేశంలోని ఇస్రో సెంటర్‌లలో ఈనెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకునేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తోంది. 2023 జులై 14న చంద్రయాన్–3 ప్రయోగాన్ని నిర్వహించి ఆగస్టు 23న ల్యాండర్‌ను చంద్రుడి ఉపరి తలంపై దక్షిణ ధృవం ప్రాంతంలో దించి చరిత్ర సృష్టించడంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా 2024 జులై 23న ప్రకటించి గత ఏడాది జులై 23 నుంచి ఆగస్టు 23 దాకా జాతీయ అంతరిక్ష దినోత్సవాలను దేశంలోని అన్ని ఇస్రో కేంద్రాల్లో నెలపాటు జరుపుకున్నారు. అంటే మొట్ట మొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాది రెండో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలింగ్ అధికారుల వేతనం పెంపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పోలింగ్ అధికారులు, సిబ్బంది వేతనాలను పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు, డిప్యూటీ డీఈవో, సీఏపీఎఫ్ సిబ్బంది, సెక్టార్ అధికారుల వేతనాలు పెంపొందించారు. అదేవిధంగా పోలింగ్, కౌంటింగ్ విధులకు ఆహారం, రీఫ్రెష్మెంట్ రేట్లను పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు గతంలో రోజుకు రూ.350 ఉండగా ప్రస్తుతం రూ.500, పోలింగ్ ఆఫీసర్‌కు రూ.250 నుంచి రూ.400, కౌంటింగ్ అసిస్టెంట్‌కు రూ.250 నుంచి రూ.450 పెంచారు.

ఎరుపెక్కిన నగరి

- మొదటిసారి జిల్లా 24వ సీపీఐ మహాసభ


నగరి పట్టణంలో కట్టిన ఎరుపు తోరణాలు


నగరి : భారత కమ్యూనిస్టు పార్టీ చిత్తూరు జిల్లా మహాసభలకు మొదటి సారిగా నగరి పట్టణం వేదిక కానుంది. ఈనెల 9, 10 తేదీల్లో 24వ జిల్లా మహాసభలు కామ్రేడ్ వసుమతి దేవి ప్రాంగణంలో నిర్వహించనున్నారు. 9వ తేదీన పట్టణంలో ఓంశక్తి గుడి నుంచి భారీ ప్రదర్శన నిర్వహించి సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి డి.జగదీష్, పి.హరినాథ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు హాజరుకానున్నారు. 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రతినిధులతో వసుమతి దేవి హాల్‌లో సభ నిర్వహించనున్నారు. శుక్రవారం నగరిలో సమావేశమైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సహాయ కార్యదర్శి టి.జనార్దన్, నగరి నియోజకవర్గ కార్యదర్శి ఎ.కోదండం పలు నిర్వహణ కమిటీలను నియమించుకుని మహాసభ దిగ్విజయం కోసం ఏర్పాట్లను ముమ్మరంగావించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


జానకీరామ్ (ఫైల్)

ఐరాల: విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని కాకర్లవారిపల్లెలో చోటుచేసుకుంది. కాణిపాకం పోలీసుల కథనం మేరకు.. కాకర్లవారిపల్లెకు చెందిన జానకీరామ్(53) వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తమ ఇంటి పక్కన ఉన్న సొంత భూమిలో పశువులను మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో విద్యుత్ తీగలు తెగిపడి ఉండడంతో చేతితో వాటిని పక్కకు తీసివేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో అటెండర్ మృతి


మగ్గం నవీన్ కుమార్(ఫైల్)

గంగాధరనెల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న మగ్గం నవీన్‌కుమార్ (31) గుండె పోటుతో మృతి చెందారు. మదనపల్లికి చెందిన ఆయన తన తండ్రి మరణంతో కారుణ్య నియామకాల కింద ఉద్యోగంలో చేరారు. శుక్రవారం ఉదయం మదనపల్లిలో గుడికి వెళ్లేందుకు సిద్ధమవుతూ ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. నవీన్‌కుమార్ మృతికి స్థానిక అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం, పోలీసుల అదుపులో స్మగ్లర్లు

తిరుపతి మంగళం : అక్రమంగా తరలిస్తున్న ఎర్ర చందనంతో పాటు ముగ్గురు స్మగ్లర్లను శుక్రవారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీలు ఎండీ షరీఫ్, శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ టీ.విష్ణువర్ధన్ కుమార్ బృందం స్థానిక ఎఫ్‌బీఓ కె.వేణుగోపాల్‌తో కలిసి శుక్రవారం కూంబింగ్ చేపట్టారు. సత్యవేడు అటవీ ప్రాంతంలో తెల్లవారుజామున జంబుకేశ్వరపురం నీలగిరి తోట వద్ద రెండు మోటారు సైకిళ్లతో కొంత మంది వ్యక్తులు కనిపించగా వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారిలో కొందరు పారిపోయారన్నారు. అయితే ముగ్గురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారు సమీపంలో దాచిన 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒకరు తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తి కాగా, మరో ఇద్దరు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత విద్య..మిథ్య

తిరుపతి సిటీ : నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రైవేటు పాఠశాలలో అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులతో కూటమి సర్కారు ఆటలాడుతోంది. పేద పిల్లలకు ప్రైవేట్ తమ కార్పొరేట్ పాఠశాలలో ప్రవేశాలను ఆశ చూపి చేతులెత్తేసింది. ఇప్పటికే రెండు విడతల అడ్మిషన్లు పూర్తయ్యాయని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం వాస్తవ గణాంకాలను చూస్తే విస్తుపోవాల్సిందే.! జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై పట్టించుకున్న పాపాన పోలేదు.

మాట వినని ప్రైవేటు యాజమాన్యాలు

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో కనీసం (ఆర్టీఈ) కింద పేద విద్యార్థుల అడ్మిషన్లు 2శాతం మించలేదంటే అతిశయోక్తి కాదు. జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు పలుమార్లు ప్రైవేటు యాజమాన్యాలతో జరిపిన చర్చలు పూర్తి స్థాయిలో విఫలమయ్యాయి. ఈ ప్రతిపాదనను తాము అంగీకరించమంటూ బహిరంగంగానే అధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చి చెబుతున్నారు. ఇప్పటికే అడ్మిషన్లు తక్కువై నష్టాలతో కళాశాలలు, పాఠశాలలు నడుపుతున్నామని ప్రైవేటు యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో ఉచితంగా 25 శాతం అడ్మిషన్లు ప్రభుత్వం తమపై రుద్దడం కక్ష సాధింపులో భాగమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తుగా ఆదేశాలు జారీ చేసినా..

రాష్ట్ర ప్రభుత్వం (ఆర్టీఈ) ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25శాతం పేద విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని మే నుంచి జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. అప్పటి నుంచి విద్యాశాఖ అధికారులు కనీసం రెండు శాతం అడ్మిషన్లూ చేయలేకపోయారు. తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ జూన్ 12న ప్రారంభమైన ఆ నెలలో కనీసం ఒక్క శాతం కూడా ప్రవేశాలు చేయలేకపోవడం గమనార్హం. అనంతరం రెండో విడత జులై నెలలో ప్రారంభమైనా... రెండు శాతానికి సైతం చేరుకోలేకపోయారు. దీంతో ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేక జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చేతులెత్తేసింది.

108 బిందెలతో పాలాభిషేకం


రాజరాజేశ్వరి, ఓంశక్తి అమ్మవార్లకు చిత్తపార గ్రామంలో శుక్రవారం ఆడినెల సందర్భంగా 108 పాల బిందెలతో ఊరేగింపుగా వెళ్లి అభిషేకం నిర్వహించారు. అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాజరాజేశ్వరి, ఓంశక్తి అమ్మవార్లను పంబలు, సిలంబాటలతో అత్యంత వైభవంగా ఊరేగించారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. - గుడిపాల